క్లుప్తంగా

నడకతో ఆరోగ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నడకతోనే ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతగా నడవడం అలవాటుగా చేసుకోవాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి, డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక గులాబీతోట అమరావతి వాకర్స్ క్లబ్‌లో ఆదివారం వారు వాకర్స్ పతాకాన్ని ఎగురవేసి క్లబ్ వ్యవస్థాపకులు సుంకరి ఆళ్వార్ దాస్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వాకర్స్ నాయకులు కొండాయగుంట రాము, బండారు కొండ, యర్రంశెట్టి శ్రీను, గంగాధర్, శ్రీనివాస రాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ కరాటే పోటీలకు విజయ్‌కుమార్



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ది వరల్డ్ షోటోకాన్ కరాటే డో–ఫెడరేషన్ ఆధ్వర్యంలో జపాన్‌లో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు జరిగే 17వ ప్రపంచ కరాటే పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధనే లక్ష్యమని కరాటే మాస్టర్ జే.విజయకుమార్ అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వీసాతో కూడిన ఆహ్వానం అందడటంతో సోమవారం తాను జపాన్‌కు బయలుదేరుతున్నానని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల అనంతరం కరాటే శిక్షణలో మెలకువలు, కరాటే పోటీల నిర్వహణలో న్యాయనిర్ణేతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణా తరగతులు జరుగుతాయని విజయ్‌కుమార్ వివరించారు.

సందడిగా ముందస్తు విజయదశమి పండుగ



పెనమలూరు: కానూరు భాష్యం పాఠశాలలో ముందస్తుగా దసరా పండుగను విద్యార్థులు నవ దుర్గాదేవి అవతారాలతో అలరించి సందడి చేశారు. దసరా పండుగ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఆకట్టుకునే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కోలాటం నాటికలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జోషి దసరా పండుగ, సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ బ్యూలా, ప్రిన్సిపాల్ శైలజ, హెచ్‌ఎం రేష్మ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు జనాభా ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి(కేఆర్‌పీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేని పక్షంలో దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి రోజైన డిసెంబర్ 26న నిరవధిక నిరాహార దీక్షలకు దిగనున్నట్లు తెలిపింది. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కేఆర్‌పీఎస్ సమావేశం జరిగింది. కేఆర్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, చైర్మన్ చనమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాపులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాల వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పోస్టుల్లో జనాభా ప్రాతిపదికగా 12 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా కార్యాచరణతో ముందుకెళతామన్నారు. కాపు రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాపు జేఏసీ నాయకులు మాసాబత్తుల శ్రీనివాస్, ముత్యాల రామదాసు, రాయలసేన ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా దృష్ట్యా పీజీఆర్ఎస్ రద్దు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు–పరిష్కారం(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 22, 29వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. నగర వాసులు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.

ఉత్సవ శోభ

శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలతో ఇంద్రకీలాద్రిపై ఉత్సవ శోభ నెలకొంది. సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









దసరా ఉత్సవాలకు పాతబస్తీ ముస్తాబు

- నేటి నుంచి శ్రీ దేవీ శరన్నవరాత్రులు
- రోజుకొక అలంకారంలో దర్శనమివ్వనున్న అమ్మవార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాలకు వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ వైభవోపేతంగా ముస్తాబయ్యాయి. ఆలయాలను ఆయా నిర్వాహకులు సర్వాంగసుందరంగా అలంకరించారు. దసరా ఉత్సవాలకు వన్‌టౌన్‌కు ప్రత్యేక స్థానముంది. ప్రధానంగా దుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ప్రతి ఒక్కరూ వన్‌టౌన్‌లోని వివిధ మార్గాల మీదుగా రాకపోకలు సాగించాలి. దీనికి తోడు వన్‌టౌన్‌లో ఆలయాల్లో ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి రోజూ ప్రత్యేక అలంకాలరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ఆయా ఆలయాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు కూడా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ కళాకారులతో పాటుగా ఔత్సాహిక కళాకారులను ఆహ్వానించి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయాల్లో ప్రత్యేక వైదిక కార్యక్రమాల్లో ఉభయదాతలు పాల్గొనే విధంగా నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

11 రోజులు ఉత్సవ శోభ

ప్రతి ఏటా నవరాత్రులు లేదా పది రోజుల పాటు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతుంటాయి. కానీ ఈ ఏడాది 11 రోజుల పాటు అమ్మవారి దసరా ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా 11 రోజుల పాటు అమ్మవారు విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొలి రోజు అన్ని ఆలయాల్లో అమ్మవార్లు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిస్తారు. పాత శివాలయంలో శ్రీస్వర్ణకవచాలంకృత భ్రమరాంబ దేవిగా భక్తులకు దర్శనమిస్తారు. అలాగే గాయత్రీదేవి, శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ కాత్యాయినీదేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ లలితాత్రిపురసుందరీ దేవి, శ్రీ మహాచండీదేవి, శ్రీ సరస్వతీదేవి, శ్రీ దుర్గాదేవి, శ్రీ మహిషాసురమర్దినీదేవి, శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాల్లో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. వైష్ణవాలయాల్లో మాత్రం ఇతర వైష్ణవ సంప్రదాయాల్లోని అమ్మవార్లను అలంకరిస్తారు.



కేటీ రోడ్డులోని గంగానమ్మ దేవస్థానం

గంగానమ్మ దేవస్థానంలో..

వన్‌టౌన్ కేటీ రోడ్డులో శ్రీనివాసమహల్ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ గంగానమ్మ దేవస్థానంలో దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజుకొక ప్రత్యేక అలంకారంలో గంగానమ్మవారు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటుగా కేటీ రోడ్డులో ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉత్సవాల అనంతరం అన్నదాన కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.



బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం

శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో...

బ్రాహ్మణవీధిలో వేం చేసి ఉన్న శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధానంగా ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ చదునుమహాలక్ష్మమ్మ అమ్మవారితో పాటుగా అష్టలక్ష్ములకు కూడా ప్రత్యేక అలంకారాలు చేస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. చదును మహాలక్ష్మమ్మకు వివిధ అమ్మవారి అలంకారాల్లో, లక్ష్మీదేవి అమ్మవారికి అష్టలక్ష్ముల స్వరూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు..

వన్‌టౌన్‌లోని శ్రీ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి వార్షిక దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ తెలిపారు. అలాగే ప్రతి రోజు అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని మందిరం ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేత్రపర్వంగా సంగీత నృత్య సమ్మేళనం

విజయవాడకల్చరల్: శ్రీవాగ్దేవీ వాయిద్య సంగీత, నృత్య సంస్కృతీ సంస్థ ఆధ్వర్యాన లబ్బీపేటలోని శ్రీశారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య సమ్మేళనం నేత్రపర్వంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యం, మోహినీ అట్టం, జానపద అంశాలను ప్రదర్శించారు. వాయిద్య కళాకారుల బృందం నాటరాగంలో ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన మహాగణపతిం, త్యాగరాజస్వామి కీర్తన శ్రీరాగంలోని ఎందరో మహానుభావులు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని కీర్తన చూడరమ్మ సతులార కీర్తనలను పలికించారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు డాక్టర్ రామ్మోహనరావు, సంస్థ నిర్వాహకుడు బి.నాగేంద్ర యాదవ్, తిరుమల తిరుపతి దేవస్థాన సంగీత కళాశాల అధ్యాపకుడు చంద్రశేఖర్ నృత్యోత్సవంలో పాల్గొన్న నాట్యాచార్యులను, చిన్నారులను సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.



నాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావును, చిన్నారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయం

పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంటు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం స్పందన వాకర్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం ప్రశాంతినగర్ ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె తండ్రిలేని పేద విద్యార్థిని ఈపూరి మధుప్రియకు రూ. 20 వేలు, 20 మంది విద్యార్థులకు రూ.8 వేల విలువ చేసే పౌష్టికాహారం కిట్లు, 12 మంది వాకర్స్‌కు, యోగా విన్యాసాలు చేసిన 30 మందికి, కోలాటం మహిళలకు బహుమతులు అందజేశారు. డిస్ట్రిక్టు 202 గవర్నర్ ఎ.విజయలక్ష్మి, స్పందన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.మురళి, కోశాధికారి ఎస్.చెన్నకేశవరావు, యోగా మాస్టర్ కె.నరసింహామూర్తి, మాజీ గవర్నర్లు ఎక్స్‌రే కొల్లూరి, ప్రకాశరావు, శ్రీనివాసరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొంగ స్వాములు ఆక్రమించిన భూములపై అసెంబ్లీలో చర్చ జరపాలి

హేతువాద సంఘం డిమాండ్



మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ భూములను ఆక్రమించిన దొంగస్వాముల వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ జరపాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాతికేళ్లుగా కొందరు దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి పెద్ద పెద్ద కట్టడాలు నిర్మించినట్టు తెలిపారు. ఆశ్రమాల పేరుతో యజ్ఞయాగాలు, దీక్షలు చేస్తూ ప్రజలను, ప్రభుత్వాన్ని రకరకాలుగా మోసం చేస్తున్నారని, ఈ విషయాలన్నింటిపై అసెంబ్లీలో చర్చపెట్టి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తి సత్యసాయిబాబు శత జయంతి వేడుకలు ప్రభుత్వమే జరపాలని నిర్ణయించడం సరికాదన్నారు. ప్రభుత్వమే ఇలాంటివి చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు దొంగరామదూత ఆక్రమించిన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములపై తప్పనిసరిగా చర్చ జరపాలని నార్నె వెంకటసుబ్బయ్య కోరారు.

నగరంలో జోరు వాన





నగరంలో ఆదివారం సాయంత్రం జోరు వాన కురిసింది. సాయంత్రం 6 గంటల నుంచి నిరంతరాయంగా వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో రహదారులు చెరువులను తలపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాహిత్యం ప్రజాజీవితంలో భాగస్వామి కావాలి



విజయవాడకల్చరల్: సాహిత్యం ప్రజాజీవితంలో భాగస్వామి కావాలని విశ్రాంత తెలుగు అధ్యాపకుడు పింగళి వెంకట కృష్ణారావు పేర్కొన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్‌లో ఆదివారం తెలుగు సాహితీ సుమ సౌరభాల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పింగళి మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యం సమాజ హితం కోరుకుంటుందని చెప్పారు. ప్రాచీన సాహిత్యంలో ముఖ్యంగా ధర్మ రక్షణ కనిపిస్తుందన్నారు. విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ కావూరి సత్యవతి తెలుగు భాషా మధురిమలు, కె.నరసింహమూర్తి అమరావతి కథలు, వై.రాజేశ్వరి ఆటవెలది – తేటగీతి మన తెలుగు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ చేమకూర వేంకటకవి విజయవిలాసం, పి.వెంకట శైలజ కందంలో తెలుగు అందాలు అంశంగా ప్రసంగించారు. ప్రబోధాత్మక కవి కె.శ్యాంప్రసాద్‌రెడ్డి వాట్ ఈస్ రామాయణ టూమీ అంశంగా కవితా గానం చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: మోహన కృష్ణ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయకుడు ఆశయ్య పర్యవేక్షణలో గాయనీ గాయకులు షేక్ రసూల్‌బాబు, పి.రవికుమార్, లక్ష్మణ్ నాయక్, వి.రాంజీనాయక్, రూపశ్రీ, సుమ, సుకన్య, దీప్తిలు తెలుగు సినీ గీతాలను మధురంగా ఆలపించారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాయకుడు ఆశయ్యను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, బి.వి. వీరభద్రరావు, చావా నరసింహారావు, బి.లక్ష్మీబాయి, బి.లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పీఎస్ ప్రాంగణంలో సీపీ పూజలు



పూజలు నిర్వహిస్తున్న సీపీ రాజశేఖరబాబు దంపతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దసరా ఉత్సవాల ముందు రోజున పోలీసు శాఖ నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించడం గడిచిన దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం సీపీ దంపతులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకొని అక్కడ ప్రతి ఏటా నిర్వహించే విధంగా రావిచెట్టు వద్ద ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ ఎన్.దుర్గారావు పాటు నగరంలోని సీఐలందరూ సతీమణులతో కార్యక్రమానికి హాజరయ్యారు. అదేవిధంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సిబ్బంది మొత్తం కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరయ్యారు. పూజల అనంతరం సీపీ దంపతులు అమ్మవారికి సమర్పించే పట్టుచీర, పసుపు కుంకుమలను చేతబూని గుర్రపుబండి ఎక్కి దుర్గగుడికి పయనమయ్యారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, పోలీసుబ్యాండ్, తీన్‌మార్ సందడితో ఊరేగింపుగా దుర్గమ్మ సన్నిధికి తరలివెళ్లారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులందరూ సివిల్ డ్రస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక సీఐ జి.గురుప్రకాష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు పడిన అధికారులు

ఆదివారం సాయంత్రం జోరున వర్షం కురవటంతో పూజకు హాజరైన పోలీసు కుటుంబాలు, అధికారులు ఇబ్బందులెదుర్కొన్నారు. పూజల సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో స్థానిక పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. వర్షం కురవడంతో ఇబ్బంది పడ్డారు. అనంతరం పూజలు నిర్వహించి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రిపై అమ్మవారి సన్నిధికి చేరుకుని పట్టుచీర, పసుపు కుంకుమలను అమ్మవారికి సమర్పించారు.

సేవలతోనే వాసవీ క్లబ్‌లకు గుర్తింపు



హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న కేశవ రామారావు, భవానీ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలను చేసినప్పుడే వాసవీ క్లబ్‌లకు గుర్తింపు లభిస్తుందని వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. విద్యాధరపురం సితార సెంటర్‌లోని జీకే కన్వెన్షన్ హాల్‌లో భవానీ, కేశవ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ ప్రాంతీయ సమ్మేళనం కార్యక్రమానికి హజరత్తయ్య గుప్తా విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అట్టడుగు వర్గాల ప్రజలకు అవసరార్థపు సేవలు అందించడమే కాకుండా వారికి శాశ్వత ప్రయోజనం చేకూర్చే ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు. రీజియన్ చైర్మన్ మామిడి కేశవ రామారావు అధ్యక్షత వహించగా భవానీ జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు. వాసవీ క్లబ్ ద్వారా విశేష సేవలను అందించిన వారిని అడ్మిని స్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ రేణిగుంట్ల శ్రీనివాస్ అభినందించగా కేశవ రామారావు అవార్డులను అందజేశారు. ప్రాంతీయ సమ్మేళనం పరిశీలకులుగా సత్య రంగారావు హాజరైన కార్యక్రమంలో గోపాలకృష్ణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హజరత్తయ్య గుప్తా, శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు.

బీసీల సంక్షేమానికి పోరాడాలి



గొలగాని శ్రీనివాసరావును సత్కరిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీలో ఇటీవల ఏలూరు జిల్లా బీసీ సెల్ ఇన్‌చార్జిగా నియమితులైన గొలగాని శ్రీనివాసరావు ఆదివారం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు గొలగాని శ్రీనివాసరావును సత్కరించి అభినందించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి, హక్కుల కోసం పని చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలపై గళం విప్పాలన్నారు. పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌పైనే వివాదం..



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే వసంత, ముత్తవరపు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే లక్ష్యంతో విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. గొల్లపూడిలో తుది దశకు చేరుకున్న ఎగ్జిబిషన్ ఏర్పాట్లను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ కోర్టు వివాదం కేవలం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌పైనేనని విజయవాడ ఉత్సవ్‌పై కాదని స్పష్టం చేశారు. ఈ గ్రౌండ్‌ను రూ.4 కోట్లతో మెరక చేయడం ద్వారా 50 ఏళ్లకు సరిపడే ఆదాయం వచ్చిందని దేవదాయ శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారన్నారు. అమ్మవారి దర్శనం కోసం రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు అహ్లాదం, వినోదాన్ని అందించడం కోసం నగరంలో నాలుగు ప్రదేశాల్లో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మరుగునపడిన కళలను వెలికితీసి కళాకారులను ప్రోత్సహించడం కోసం కొన్ని కార్యక్రమాలను చేపట్టామన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ముత్తవరపు మురళీకృష్ణ, కూటమి నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నర్రా వాసు, నూతలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్ ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా భవానీపురం పున్నమిఘాట్‌లో చేస్తున్న ఏర్పాట్లను ఎంపీ చిన్ని ఆదివారం సాయంత్రం పరిశీలించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, ఏఎంసీ వైస్ చైర్మన్ పాల మాధవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.